క్లుప్తంగా

కల్పన దేవసానికి జాతీయ ఉత్తమ కవి అవార్డు



మోపాల్: మండలంలోని కంజర్ శివారులో ఉన్న తెలంగాణ సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల కళాశాలలో తెలుగు ఉపాధ్యాయులు కల్పన దేవసాని 2025 సంవత్సరానికిగాను జాతీయ ఉత్తమ కవి అవార్డును అందుకున్నారు. నీతి ఆయోగ్ ద్వారా గుర్తింపు పొందిన మనం ఫౌండేషన్ 9 ఏళ్ల విజయయాత్రను పూర్తి చేసుకున్న సందర్భంగా హైదరాబాద్‌లో కవి సమ్మేళనాన్ని శనివారం నిర్వహించారు. సమ్మేళనానికి కల్పన దేవసానికి ప్రత్యేక ఆహ్వానం అందింది. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన సుప్రీంకోర్టు అడ్వకేట్ ఎ పద్మాచారి, సాహితీవేత్త విమర్శకులు ఎన్వీ రఘువీర్ ప్రతాప్, ఫౌండేషన్ అధ్యక్షుడు కె చక్రవర్తి కల్పనకు జాతీయ ఉత్తమ కవి అవార్డును ప్రదానంచేశారు. అవార్డు పొందడంపై సహచర ఉపాధ్యాయులు, కుటుంబ సభ్యులు, మిత్రులు ఆమెకు అభినందనలు తెలిపారు.

ఎస్సైకి సన్మానం



సిరికొండ: సిరికొండ పీఎస్‌కు కొత్తగా వచ్చిన ఎస్సై జె రామకృష్ణను బీజేవైఎం మండల నాయకులు శనివారం మర్యాద పూర్వకంగా కలిసి సన్మానించారు. బీజేవైఎం మండల అధ్యక్షుడు పోతుగంటి మధు, ఉపాధ్యక్షులు విష్ణు, గంగదాసు, ప్రధాన కార్యదర్శి రణదీశ్, చందు తదితరులు ఉన్నారు.

సమస్యను పరిష్కరించాలి

నిజామాబాద్ సిటీ: మున్సిపల్ కార్పొరేషన్‌లో అవుట్ సోర్సింగ్ విధానంలో పనిచేస్తున్న వారు, అనారోగ్యంతో బాధపడుతున్న వారి స్థానంలో వారి సంబంధీకులను నియమించాలని మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు దండి వెంకట్ కోరారు. శనివారం మున్సిపల్ కమిషనర్ దిలీప్‌కుమార్‌ను కలిసి వినతిపత్రం సమర్పించారు. కార్పొరేషన్‌లోని పారిశుద్ధ్య విభాగంలో 30 ఏళ్లుగా కొందరు డ్యూటీలు చేశారని వారిలో కొందరు మృతిచెందగా, మరికొందరు వృద్ధాప్యంతో డ్యూటీలు చేయలేకపోతున్నారన్నారు. దాదాపు 20 మందికి రీప్లేస్‌మెంట్ చేయాలని కోరారు. నాయకులు సబ్బని లత, రాజేందర్ తదితరులు ఉన్నారు.

యువత రాజకీయాల్లో భాగం కావాలి

డిచ్‌పల్లి: స్థానిక సంస్థల ఎన్నికలతో పాటు రాజకీయాల్లో యువత భాగం కావాలని ఆమ్ ఆద్మీ పార్టీ(ఆప్) నిజామాబాద్ రూరల్ ఇన్‌చార్జి షేక్ జుబేర్ అహ్మద్ శనివారం ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు. గ్రామాలతో పాటు అసెంబ్లీ, పార్లమెంట్ నియోజకవర్గ స్థాయిలో జరిగే అన్ని రకాల ఎన్నికల్లో అతి కొద్ది మంది యువత మాత్రమే ఆసక్తి చూపుతున్నారని పేర్కొన్నారు. యువత ప్రత్యక్ష రాజకీయాల్లో పాలుపంచుకుని గ్రామ, మండల, జిల్లా, రాష్ట్ర, దేశాభివృద్ధికి తమ వంతు కృషి చేయాలని కోరారు.

హోటల్‌లోకి దూసుకెళ్లిన బైక్

మోపాల్: మండలంలోని కంజర్‌కు చెందిన ఓ ద్విచక్రవాహనం మోపాల్ చౌరస్తాలో ఉన్న హోటల్‌లోకి శనివారం దూసుకెళ్లింది. గ్రామస్తులు, ప్రత్యక్ష సాక్షులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన ఇద్దరు యువకులు టిఫిన్ కోసం హోటల్‌కు వెళ్లారు. టిఫిన్ తీసుకున్న తర్వాత ఓ యువకుడు బైక్ గేర్లలో ఉండగా సెల్ఫ్ బటన్ నొప్పి ఎక్స్‌లేటర్ ఇచ్చాడు. దీంతో బైక్ అక్కడే ఉన్న హోటల్‌లోకి దూసుకెళ్లింది. ప్రమాదంలో హోటల్ యజమానిపై సాంబారు పడి స్వల్పంగా గాయమైంది. పోలీసులకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని తెలిసింది.

బంగారం ధరలు (10గ్రాములు)

24 క్యారెట్స్	98,800	వెండి(కిలో)	1,13,500
22 క్యారెట్స్	91,205	- నిజామాబాద్ బిజినెస్	

మాంసం ధరలు

చికెన్	ధరలు	డ్రెస్సడ్	160
	(కిలోకు)	లైవ్	120
స్కిన్‌లెస్	200	మటన్	800

కూరగాయల ధరలు(రూ.)

	హోల్‌సేల్	రిటైల్		హోల్‌సేల్	రిటైల్
టమాట	20	40	గాజరుగడ్డ	30	60
బెండకాయ	40	70	పచ్చిమిర్చి	60	90
బీరకాయ	40	70	దోసకాయ	20	40
దొండకాయ	30	60	ఆలుగడ్డ	25	50
జీర్నిసకాయ	80	120	గోబిగడ్డ	10	20
కాకరకాయ	40	60	గోబిపువ్వు	40	70
వంకాయ	40	60	బీట్‌రూట్	30	60
పాలకూర	30	50	కరివేపాకు	40	60
మెంతికూర	50	80	చామగడ్డ	35	60
కొత్తిమీర	30	50	చిక్కుడుకాయ	45	75
పుదీనా	60	90	గోరుచిక్కుడు	30	60
క్యాప్సికం	50	90			

-సుభాష్‌నగర్

శరవేగంగా ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు

- మోపాల్ మండలానికి 502 మంజూరు
- 284 ఇళ్ల పనులు ప్రారంభం
- 48 మంది లబ్ధిదారుల ఖాతాల్లో రూ.లక్ష చొప్పున జమ



నర్సింగ్‌పల్లిలో కొనసాగుతున్న ఇందిరమ్మ ఇంటి నిర్మాణ పనులు

మోపాల్: పేదోడి సొంతింటి కలను సాకారం చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు శరవేగంగా సాగుతున్నాయి. లబ్ధిదారులు సైతం ఇళ్లు నిర్మించుకునేందుకు ఉత్సాహంగా ముందుకు వస్తున్నారు. రూ. ఐదు లక్షలను ప్రభుత్వం నాలుగు విడతలుగా లబ్ధిదారులకు చెల్లిస్తోంది. ప్రభుత్వం సూచించిన కొలతలతో నిర్మించుకున్న ఇళ్లకే పథకం వర్తింపజేస్తున్నారు. ఇందుకోసం ప్రత్యేకంగా యాప్‌ను రూపొందించారు. మోపాల్ మండలానికి 502 ఇందిరమ్మ ఇళ్లు మంజూరయ్యాయి. అందులో ఇప్పటికే 284 మంది ఇళ్ల నిర్మాణ పనులను ప్రారంభించారు. మరో 99 మంది కొన్ని అనివార్య కారణాల వల్ల పనులు ప్రారంభించలేదు. 105 ఇళ్లు బేస్‌మెంట్ లెవల్‌లో ఉన్నాయి. 117 మంది లబ్ధిదారులు ప్రస్తుతం తాము నిర్మించుకోమని అధికారులకు చెప్పారు. దీంతో వీరి స్థానంలో వేరే లబ్ధిదారులకు అవకాశమివ్వాలని మండలస్థాయి అధికారులు కలెక్టర్‌కు నివేదించారు.మండలంలోని నర్సింగ్‌పల్లి గ్రామాన్ని మోడల్‌గా ఎంపిక చేసి,దరఖాస్తు చేసుకున్న అర్హులకు ఇళ్లను మంజూరు చేశారు. 45 మంది లబ్ధిదారులు ఇళ్ల నిర్మాణ పనులు మొదలుపెట్టారు.

బేస్‌మెంట్ లెవల్ పూర్తి

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు బేస్‌మెంట్ లెవల్ పూర్తయిన 48 మంది లబ్ధిదారులకు రూ.లక్ష చొప్పున వారి ఖాతాల్లో జమయ్యాయి. బేస్‌మెంట్ లెవల్ పూర్తయిన మిగతా వారికి రూ. లక్ష వరకు జమ కానున్నాయి. పనులు వేగంగా ముందుకు సాగుతున్నాయి. మండలంలో ఇళ్లు మంజూరైన లబ్ధిదారుల వద్ద డబ్బులు లేని పేదలకు నిర్మాణానికి అవసరమైన డబ్బులు సమకూర్చాలని అధికారులు చర్యలు చేపడుతున్నారు. గ్రామ సమాఖ్యలో సభ్యత్వం కలిగి ఉంటే రూ.లక్ష నుంచి రూ.లక్షన్నర వరకు రుణం ఇచ్చి ఇందిరమ్మ ఇళ్లు నిర్మించుకునేలా ఏర్పాట్లు చేస్తున్నారు.

అధికారుల నిరంతర పర్యవేక్షణ

ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకుంది. ఇళ్లు కట్టుకునే వారిని ప్రోత్సహించేందుకు ప్రతి సోమవారం వారి ఖాతాల్లో డబ్బులు జమ చేస్తోంది. అధికారులు నిర్మాణాల వద్దకు వచ్చి పర్యవేక్షిస్తున్నారు. నిబంధనల ప్రకారం సలహాలు, సూచనలు చేస్తున్నారు. బేస్‌మెంట్, గోడలు, స్లాబ్ లెవల్, నిర్మాణం పూర్తయిన తర్వాత విడతల వారీగా రూ. ఐదు లక్షల నిధులు జమ అవుతున్నాయి. ప్రభుత్వం నిర్దేశించిన లెవల్‌కు రాగానే అధికారులు వచ్చి యాప్‌లో ఫొటోలు నమోదు చేస్తున్నారు.

లబ్ధిదారులను ప్రోత్సహిస్తున్నాం



ఇందిరమ్మ ఇళ్లు మంజూరైన లబ్ధిదారులను పనులు శరవేగంగా సాగేలా ప్రోత్సహిస్తున్నాం. 48 మందికి రూ.లక్ష వరకు జమయ్యాయి. 117 మంది లబ్ధిదారులు ఇల్లు కట్టుకోమని చెప్పడంతో వారి స్థానంలో మిగతా వారికి అవకాశం కల్పించాలని ఎమ్మెల్యే సూచనల మేరకు కలెక్టర్‌కు నివేదించాం. అర్హులకు ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేయడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉంది. త్వరలోనే అనుమతులు వస్తాయి.

– రాములు నాయక్, ఎంపీడీవో, మోపాల్

ఆర్యవైశ్యుల అభివృద్ధికి కృషి చేయాలి

- అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ



అధ్యక్షులను సన్మానించిన ఎమ్మెల్యే ధన్‌పాల్

సుభాష్‌నగర్: ఆర్యవైశ్యుల సమాజ అభివృద్ధికి నూతన కార్యవర్గం కృషి చేయాలని నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ సూచించారు. ఆర్యవైశ్య పట్టణ సంఘం అధ్యక్షుడిగా గెలుపొందిన ధన్‌పాల్ శ్రీనివాస్ గుప్తా అనుబంధ సంఘాల అధ్యక్షులతో కలిసి శనివారం ఎమ్మెల్యే ధన్‌పాల్‌ను తన క్యాంప్ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వారిని ఎమ్మెల్యే ప్రత్యేకంగా అభినందించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. గెలుపుతో తమ బాధ్యతను మరింత పెంచిందన్నారు. సంఘ అభివృద్ధికి పాటుపడాలని అన్నారు. ఆర్యవైశ్య పట్టణ సంఘం అధ్యక్షుడు ధన్‌పాల్ శ్రీనివాస్ మాట్లాడుతూ.. ప్రత్యర్థులు ఎన్ని ప్రలోభాలు పెట్టినా, కుట్రలు చేసినా చివరికి ధర్మమే గెలిచిందన్నారు. తన గెలుపునకు సహకరించిన ప్రతిఒక్కరికి ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో అనుబంధ సంఘాల అధ్యక్షులు ఇంగు శివప్రసాద్, పాల్తి రవి కుమార్, ఇల్లందుల సుధాకర్, లిఖిత్, వివేకానంద, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

నాయక్వాడి నర్సయ్య ఆశయాలను కొనసాగిద్దాం



సభలో మాట్లాడుతున్న వేములపల్లి వెంకట్రామయ్య

నిజామాబాద్ సిటీ: దేశ ప్రజలంతా అసమానతలు లేని సమాజంలో నివసించాలనే ఆశయంతో తుది వరకు సీపీఐ(ఎంఎల్)న్యూడెమోక్రసీ సీనియర్ నాయకుడు నాయక్వాడి నర్సయ్య పోరాడారని, ఆయన ఆశయాలను కొనసాగిద్దామని సీపీఐ(ఎంఎల్)న్యూడెమోక్రసీ కేంద్ర కమిటీ సభ్యుడు వేములపల్లి వెంకట్రామయ్య అన్నారు. శనివారం జిల్లాకేంద్రంలోని అర్సపల్లిలో దివంగత నాయక్వాడి నర్సయ్య సంస్మరణ సభ ఆకుల పాపయ్య అధ్యక్షతన నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన వెంకట్రామయ్య మాట్లాడుతూ.. సింగూరు జలాల కోసం, నిజాంసాగర్ ఆయకట్టు రైతుల కోసం ఆయన ఎంతగానో పోరాడారన్నారు. న్యూడెమోక్రసీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు సాధినేని వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. దేశ సంపద రక్షణ కోసం యువత ఉద్యమానికి సిద్ధం కావాలని నర్సన్న స్ఫూర్తితో ఉద్యమించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి ఆకుల పాపయ్య, నాయకులు పరుచూరి శ్రీధర్, ఎస్ దాసు, వేల్పూరు భూమయ్య, నీలం సాయిబాబా, సూర్య శివాజీ, భూమన్న, ప్రొఫెసర్ సరిత, నర్సన్న బంధువులు, అర్సపల్లి వాసులు పాల్గొన్నారు.

ఇచ్చిన మాటను నిలబెట్టుకున్న కాంగ్రెస్

- రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే భూపతిరెడ్డి

ధర్పల్లి: కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన మాటను నిలబెట్టుకుంటూ ప్రజల మన్ననలు పొందుతోందని నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి అన్నారు. శనివారం ధర్పల్లి మండల కేంద్రంలో పర్యటించిన ఎమ్మెల్యే ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులను పరిశీలించి లబ్ధిదారులతో మాట్లాడారు. దమ్మన్నపేట్‌లో పెద్దమ్మ ఆలయ ప్రారంభోత్సవంలో పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ధర్పల్లిలో బీజేపీ, బీఆర్ఎస్ పార్టీ నుంచి పలువురు యువకులు ఎమ్మెల్యే సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. వారికి ఎమ్మెల్యే కండువా వేసి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ.. దళితులకు మంత్రివర్గంలో స్థానం కల్పించడం తమ పార్టీ సామాజిక న్యాయం పాటిస్తుందన్నాడానికి నిదర్శనమన్నారు. ఇచ్చిన మాటను నిలబెట్టుకుంటూ బీసీ రిజర్వేషన్ క్యాబినెట్ తీర్మానం చేశామన్నారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ విజయానికి కృషి చేయాలని నాయకులకు కార్యకర్తలకు సూచించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ఆర్మూర్ బాలరాజ్, నాయకులు మిట్టపల్లి గంగారెడ్డి, చెలిమెల నరసయ్య, సుభాష్, సురేందర్ గౌడ్, జనార్దన్‌రెడ్డి, చిన్నారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

స్పందించారు.. చెత్తను తొలగించారు

సాక్షి ఎఫెక్ట్..



నిజామాబాద్ సిటీ: నిజామాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని జోన్-1 కార్యాలయం ముందు ఉన్న చెత్త కుప్పలను సంబంధిత అధికారులు తొలగింపు చర్యలు చేపట్టారు. దుబ్బ ప్రాంతంలో ప్రధాన రహదారి పక్కన ఉన్న జోన్-1 కార్యాలయం ఎదుట చెత్త పేరుకుపోతుంది. దీంతో స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. ఈ సమస్యపై శనివారం సాక్షి దినపత్రికలో ప్రచురితమైన 'చెత్త శుద్ధి ఏది?' అనే కథనానికి మున్సిపల్ డిప్యూటీ కమిషనర్, ఇన్‌చార్జి ఎంహెచ్‌వో రవిబాబు స్పందించారు. వెంటనే పారిశుద్ధ్య సిబ్బందితో చెత్త తొలగింపు పనులు చేపట్టారు. అదేవిధంగా సంబంధిత శానిటరి ఇన్‌స్పెక్టర్‌ను మందలించారు. జోన్ కార్యాలయం ఎదుట ఉన్న చెత్త తొలగింపుపై స్థానికులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ప్రతి రోజు ఈ రోడ్డు గుండా వెళ్లాలంటే ముక్కు మూసుకొని వెళ్లాల్సిన పరిస్థితి ఉండేదన్నారు. సమస్య పరిష్కారానికి కృషి చేసిన సాక్షి దినపత్రికకు స్థానికులు కృతజ్ఞతలు తెలిపారు.

పేదలకు అండగా కాంగ్రెస్ ప్రభుత్వం



సిరికొండ: పేదలకు కాంగ్రెస్ ప్రభుత్వం అండగా నిలుస్తోందని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు ఉమ్మాజీ నరేశ్ అన్నారు. మండలంలోని న్యావనంది గ్రామానికి చెందిన బాధితులకు సీఎంఆర్ఎఫ్ చెక్కులను ఆయన శనివారం పంపిణీ చేశారు. రూరల్ నియోజకవర్గంలో ఎమ్మెల్యే భూపతిరెడ్డి ప్రత్యేక చొరవతో బాధితులకు త్వరితగతిన సీఎంఆర్ఎఫ్ చెక్కులను మంజూరు చేయిస్తున్నారని తెలిపారు. పార్టీ నాయకులు రొండ్ల గోవర్ధన్‌రెడ్డి, మగ్గిడి రాంరెడ్డి, జీవన్ తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ స్టాండింగ్ కౌన్సిల్ మెంబర్‌కు సన్మానం



శ్యామ్‌ను సన్మానిస్తున్న నాయకులు

నిజామాబాద్‌నాగారం: నిజామాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ స్టాండింగ్ కౌన్సిల్ సభ్యుడిగా బాధ్యతలు స్వీకరించిన శ్యామ్‌ను జాతీయ బీసీ సంక్షేమ సంఘం జిల్లా కమిటీ సభ్యులు శనివారం ఘనంగా సన్మానించారు. అదేవిధంగా రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మినిస్టీరియల్ స్టాఫ్ రాష్ట్ర అధ్యక్షుడిగా హెచ్ రేవంత్ ఏకగ్రీవంగా ఎన్నిక కావడంతో బీసీ నాయకులు ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. దీంతో పాటు జాతీయ బీసీ సంఘం ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జి పోతనకర్ లక్ష్మీనారాయణ, ఫిజికల్ డైరెక్టర్ అసోసియేషన్ జిల్లా చైర్మన్‌గా ఎన్నికైన బొబ్బిలి నర్సయ్యను సత్కరించారు. కార్యక్రమంలో జాతీయ బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు కెంపుల నాగరాజు, ప్రధాన కార్యదర్శి ఏనుగందుల మురళి, నాయకులు శివాజీ లక్ష్మణ్ రావు, మెతుకు శివ కుమార్, సుభాష్ పద్మ, ఆమంద్ ప్రవీణ్ కుమార్, హైమద్, నవాతె ప్రతాప్, కరిపె రాజు, న్యాలం రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

'బెస్ట్ అవైలబుల్ స్కూల్' స్కీం నిధులు విడుదల చేయాలి

మోపాల్: రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న బెస్ట్ అవైలబుల్ స్కూల్ స్కీం నిధులు విడుదల చేయాలని ఏఐబీఎస్ఎస్ మండల అధ్యక్షుడు ఎల్ బాలు నాయక్ శనివారం డిమాండ్‌చేశారు. ఈ స్కీం ద్వారా పేద ఎస్సీ, ఎస్టీ, బీసీ వర్గాల విద్యార్థులు ప్రయివేటు పాఠశాలల్లో చదువుతున్నారని, మూడేళ్లుగా రాష్ట్ర ప్రభుత్వం బిల్లులు చెల్లించడం లేదన్నారు. సుమారు రూ. 200 కోట్ల బకాయిలు ఉన్నాయని, కొన్ని ప్రయివేటు పాఠశాలల యాజమాన్యాలు పిల్లలకు స్కూల్‌కు రావొద్దని, పిల్లల వద్ద ఫీజులు తీసుకుంటున్నాయని తెలిపారు. వెంటనే పెండింగ్‌లో ఉన్న బకాయిలు విడుదల చేయాలని సీఎం రేవంత్‌రెడ్డిని కోరారు.

కనుల పండువగా శ్రీవారి కల్యాణం



అమ్మవారి తాళిబొట్టు చూపుతున్న అర్చకుడు



కల్యాణంలో పాల్గొన్న దంపతులు, భక్తులు

మోపాల్: మండలంలోని నర్సింగ్‌పల్లిలో ఉన్న ఇందూరు తిరుమల గోవింద వనమాల క్షేత్రంలో శ్రవణ నక్షత్రాన్ని పురస్కరించుకుని దేవ దేవుడు శ్రీవారి కల్యాణ మహోత్సవాన్ని శనివారం వైభవంగా, కనుల పండువగా నిర్వహించారు. వేద పండితులు సంపత్ కుమారాచార్య, ప్రధాన అర్చకులు రోహిత్ కుమారాచార్య శాస్త్రోక్తంగా నిర్వహించారు. వందలాది మంది భక్తులు శ్రీవారి కల్యాణాన్ని తిలకించారు. కార్యక్రమంలో ఆలయ సేవకులు నరాల సుధాకర్, నర్సారెడ్డి, రామ్మోహన్, సాయిలు, భాస్కర్, మురళి, పృథ్వీ, విజయ్ స్వామి, అనిల్ స్వామి, మహేశ్, సతీశ్ తదితరులు పాల్గొన్నారు.

బాధితులకు అండగా ఉంటాం



సిరికొండ: కుటుంబ పెద్దను కోల్పోయిన బాధితులకు అన్ని విధాలా అండగా ఉంటానని డీసీసీ ప్రధాన కార్యదర్శి గడ్కోల్ భాస్కర్‌రెడ్డి అన్నారు. మండలంలోని గడ్కోల్‌లో ఇటీవల మృతి చెందిన శివరాజ్, మల్కి పెద్ద లింబయ్య, సిరిపురం నడ్పి నర్సయ్య కుటుంబాలను పరామర్శించి ఆర్థికసాయం అందజేశారు. కొండాపూర్‌లో పీఏసీఎస్ డైరెక్టర్ రమేశ్, బట్టు రాంచందర్‌ను, పాకాల మాజీ సర్పంచ్ బాలకిషన్‌ను, సర్పల్లి తండాలో మాజీ సర్పంచ్ వసంతచందర్‌నాయక్‌ను ఆయన పరామర్శించారు. ఆయన వెంట యూత్ కాంగ్రెస్ రూరల్ అధ్యక్షుడు మహేందర్, నర్సారెడ్డి, నర్సింగ్, ఏఎంసీ డైరెక్టర్ సంపత్‌రెడ్డి, గొల్ల లింబన్న, సంతోష్‌నాయక్, జయరాం, మోజీరాం, జీవన్, జగన్, శ్రీధర్, గౌసొద్దీన్, బుచ్చన్న, హరీశ్‌గౌడ్, వినోద్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా దాశరథి శత జయంతి ఉత్సవాలు



నిజామాబాద్ రూరల్: నగరంలోని ఖిల్లా రామాలయంలో దాశరథి శత జయంతి కమిటీ ఆధ్వర్యంలో దాశరథి జయంతి ఉత్సవాలను శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం కార్యక్రమానికి సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో కమిటీ అధ్యక్షుడు కోనేరు సాయికుమార్, సిరిపల్లి లింగన్న, సాయిబాబా, డాక్టర్ హనుమాన్లు, వసంత, లక్ష్మి, షేర్ల సుగుణ, సంపత్, శంకర్, విజయ, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

గ్రామ దేవతలకు పూజలు



గంజ్‌లో పూజలు నిర్వహిస్తున్న ఏఎంసీ చైర్మన్

సుభాష్‌నగర్: నగరంలో ప్రతి ఏడాది నిర్వహించే ఊర పండుగ గ్రామ దేవతలకు నిజామాబాద్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ ముప్ప గంగారెడ్డి శనివారం ప్రత్యేక పూజలు చేశారు. చాట, హమాలీ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన అమ్మవార్లను పూజించి ఊరేగింపు నిర్వహించారు. కార్యక్రమంలో ఏఎంసీ డైరెక్టర్ మారుతి మల్లేశ్, హమాలీ, చాట సంఘం కార్యవర్గ సభ్యులు, హమాలీలు, చాటా కార్మికులు పాల్గొన్నారు.

యోగా గురువులకు సన్మానం

నిజామాబాద్‌నాగారం/ నిజామాబాద్ రూరల్: నగరంలోని వినాయక్‌నగర్‌లో ఉన్న మహాలక్ష్మీనగర్ కమ్యూనిటీ హాల్‌లో పతాంజలి యోగా కేంద్రం సభ్యులు యోగా గురువులను శనివారం ఘనంగా సన్మానించారు. యోగా రత్నా ప్రభాకర్, కిషన్, జలంధర్ గౌడ్, విశ్వర్య, తిరుమర్, ఆంజనేయులు, గంగా బిలశేఖర్, విజయ్ ఆర్యా, శ్రీనివాస్, మేఘన, నవీన్ ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో కాలనీ కమిటి ప్రధాన కార్యదర్శి శేఖర్ గౌడ్, మహిళా యోగా శిక్షకులు, కాలనీ సభ్యులు పాల్గొన్నారు. రూరల్ మండలంలోని కాలూర్‌లో పతాంజలి యోగా కేంద్రం ఆధ్వర్యంలో యోగా గురువులను సన్మానించారు. జిలకర కిషన్, యోగా ప్రభాకర్, విజయ్ కుమార్, అగ్గు భోజన్న, వై వెంకటరెడ్డి, మాదస్సు గంగాధర్, ముచ్చుగురి నర్స య్య, జగంపల్లి అరుణ్, యోగా గురువులు పాల్గొన్నారు.



మహాలక్ష్మీనగర్‌లో యోగా గురువులను సన్మానిస్తున్న సభ్యులు



కాలూర్‌లో..

దాబాపై దాడి

నిజామాబాద్ రూరల్: రూరల్ పీఎస్ పరిధిలోని బైపాస్ రోడ్‌లో ఉన్న లక్ష్మీ నరసింహ దాబాపై రూరల్ ఎస్‌హెచ్‌వో మహ్మద్ ఆరిఫ్ శనివారం దాడులు నిర్వహించారు. అక్రమంగా నిల్వ ఉన్న మద్యాన్ని సీజ్ చేశారు. ఎవరైనా అనుమతులు లేకుండా దాబాలు, లిక్కర్ షాపులు నిర్వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

పెన్షనర్ల ధర్నాను విజయవంతం చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న రామ్మోహన్‌రావు

నిజామాబాద్‌నాగారం: పెండింగ్‌లో ఉన్న రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్ల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఈ నెల 15న పాత కలెక్టరేట్ ఎదుట చేపట్టే ధర్నాను పింఛన్‌దారులు విజయవంతం చేయాలని తెలంగాణ ఆల్ పెన్షనర్స్–రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు రామ్మోహన్‌రావు కోరారు. శనివారం నగరంలోని సుభాష్‌నగర్‌లో ఉన్న కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రాష్ట్ర కమిటీ ఇచ్చిన పిలుపులో భాగంగా ధర్నా కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. నగదు రహిత వైద్యాన్ని అన్ని కార్పొరేట్, ప్రైవేటు ఆస్పత్రుల్లో అనుమతించాలన్నారు. పెండింగ్‌లో ఉన్న డీఏలను విడుదల చేయాలని కోరారు. సమావేశంలో ఈవీఎల్ నారాయణ, ఎస్ మదన్‌మోహన్, శిర్ప హనుమాన్లు, కృష్ణారావు, బాబా గౌడ్, హమీదుద్దీన్, లావు వీరయ్య, నరేందర్, వెంకటరావు పాల్గొన్నారు.

సంక్షిప్తం

నవోదయ ప్రవేశ ఫలితాలు విడుదల

నిజామాబాద్ అర్బన్: జిల్లా కేంద్రంలో నూతనంగా ఏర్పాటు చేసిన నవోదయ విద్యాలయ ప్రవేశ ఫలితాలు విడుదలైనట్లు ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ మను యోహన్నన్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆరో తరగతిలో ప్రవేశానికి 40 మంది విద్యార్థులు ఎంపికైనట్లు ఆయన పేర్కొన్నారు. ఈనెల 14 నుంచి ఎంపికైన విద్యార్థుల ధ్రువపత్రాల పరిశీలన ఉంటుందని, వీరికి మొబైల్ ద్వారా సమాచారం అందించినట్లు తెలిపారు.

15న జిల్లాస్థాయి స్విమ్మింగ్ పోటీలు

నిజామాబాద్‌నాగారం: నగరంలోని అమ్మవెంచర్‌లో ఉన్న ఎస్ఆర్‌కే స్విమ్మింగ్‌పూల్‌లో ఈ నెల 15న అండర్-15, 16, 17 విభాగాల్లో జిల్లాస్థాయి స్విమ్మింగ్ పోటీలు నిర్వహించనున్నట్లు స్విమ్మింగ్ అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు గడిల శ్రీరాములు, మహిపాల్‌రెడ్డి శనివారం తెలిపారు. ఇందులో ప్రతిభ చూపిన వారిని రాష్ట్రస్థాయి పోటీలకు పంపిస్తామన్నారు. గ్రూప్-1లో 2008, 2009, 2010, గ్రూప్-2లో 2011, 2012, గ్రూప్-3లో 2013, 2014 సంవత్సరాల్లో పుట్టిన వారు అర్హులని పేర్కొన్నారు. వీరితో పాటు అండర్-9, 10 పిల్లలకు కూడా ఎంపిక పోటీలు ఉంటాయని అన్నారు.

బాధిత కుటుంబాలకు ఎమ్మెల్యే పరామర్శ

ఇందల్వాయి: మండలంలోని నల్లవెల్లిలో అనారోగ్యంతో బాధపడుతున్న దామ నడిపి గంగారం, ఇటీవల గుండెపోటుతో మృతి చెందిన నోముల మోహన్‌రెడ్డి కుటుంబాలను రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి శనివారం పరామర్శించారు. ఆయన వెంట డీసీసీ ప్రధాన కార్యదర్శి భాస్కర్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు నవీన్ గౌడ్, ఐడీసీఎంఎస్ మాజీ చైర్మన్ మునిపెల్లి సాయిరెడ్డి, మాజీ ఎంపీపీ ఇమ్మడి గోపి, సంతోష్ రెడ్డి తదితరులు ఉన్నారు.

బీసీలకు రిజర్వేషన్ కల్పించడంపై హర్షం

నిజామాబాద్ రూరల్: స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించడం హర్షణీయమని జిల్లా బీసీ హక్కుల పరిరక్షణ సంక్షేమ సంఘం అధ్యక్షుడు మాయావర్ రాజేశ్వర్ అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని బీసీ సంఘ భవనంలో కార్యవర్గ సమావేశం నిర్వహించారు. బీసీ చట్ట సవరణకు ఆర్డినెన్సు జారీ చేసినందుకు రాష్ట్ర ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలిపారు. సమావేశంలో అశోక్, సత్యనారాయణ, కె సుదర్శన్, లక్ష్మణ్, రంజిత్ తదితరులు పాల్గొన్నారు.

ఆలయంలో అన్నదానం



సిరికొండ: మండలంలోని తాళ్లరామడుగు గ్రామంలోని రామాలయంలో శనివారం అన్నదానం నిర్వహించారు. ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. చిల్కూరి హేమంత్‌రెడ్డి, బండారి నరేశ్, నాగుల లింబాద్రి, కర్క రాకేశ్, నవీన్, సాయిలు, బీరయ్య, ఎర్ర శ్రీను, చిన్నగంగారెడ్డి, బొర్రన్న తదితరులు పాల్గొన్నారు.